క్లుప్తంగా

క్రీడలతో మానసికోల్లాసం

రెబ్బెన: క్రీడలతో మానసికోల్లాసం కలుగుతుందని మాజీ జెడ్పీటీసీ పల్లె ప్రకాశ్‌రావు అన్నారు. గణతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకుని మండలంలోని పులికుంట, తక్కళ్లపల్లి, రోళ్లపాడు గ్రామాల పరిధిలో కబడ్డీ పోటీలు ఏర్పాటు చేయగా గురువారం నిర్వహణ స్థలాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామీణ క్రీడల పట్ల యువకులు ఆసక్తి చూపాలన్నారు. కబడ్డీ పోటీలను ఏర్పాటు చేస్తున్న నిర్వాహకులను అభినందించారు. మాజీ పీఏసీఎస్ చైర్మెన్ గాజుల రవీందర్, మాజీ సర్పంచులు కొవ్వూరి శ్రీనివాస్, ముంజం రవీందర్, మాజీ ఉప సర్పంచ్ మహేందర్, నాయకులు మల్లయ్య, బాలయ్య, సత్తయ్య తదితరులు పాల్గొన్నారు.

నాటుసారా స్థావరాలపై దాడులు


నాటుసారా సామగ్రితో ఎక్సైజ్ అధికారులు

చింతలమానెపల్లి: మండలంలోని లంబాడి హేటి, రణవెల్లి గ్రామాల్లోని నాటుసారా స్థావరాలపై గురువారం దాడులు చేసినట్లు కాగజ్‌నగర్ ఎక్సైజ్ సీఐ రవి తెలిపారు. ఈ దాడుల్లో 60 లీటర్ల నాటుసారా, 30 కిలోల బెల్లం, 10 కిలోల పటిక స్వాధీనం చేసుకున్నామన్నారు. 4వేల లీటర్ల బెల్లం పానకం ధ్వంసం చేసినట్లు తెలిపారు. ఈమేరకు 8 మందిపై కేసులు నమోదు చేసి తహసీల్దార్ మునావర్ షరీఫ్ ఎదుట బైండోవర్ చేసినట్లు పేర్కొన్నారు. ఈ దాడుల్లో ఎక్సైజ్ ఎస్సైలు పి.లోభానంద్, ఐ.సురేష్, పి.రాజేశ్వర్, సిబ్బంది పాల్గొన్నారు.

మహాసభలు జయప్రదం చేయండి


పోస్టర్ ఆవిష్కరిస్తున్న నాయకులు

కాగజ్‌నగర్‌రూరల్: ఈనెల 25 నుంచి 28 వరకు సంగారెడ్డిలో నిర్వహించే సీపీఐఎం రాష్ట్ర 4వ మహాసభలను జయప్రదం చేయాలని సీపీఎం జిల్లా కమిటీ సభ్యులు ముంజం ఆనంద్‌కుమార్, చాపిలె సాయికృష్ణ కోరారు. పట్టణంలోని పార్టీ కార్యాలయం ఎదుట మహాసభల పోస్టర్లను గురువారం ఆవిష్కరించారు. ఈ మహాసభలకు నాయకులు, కార్యకర్తలు అధికసంఖ్యలో తరలిరావాలని కోరారు. నాయకులు సాయి, రాజేశ్,మహేశ్, గోవర్ధన్, తిరుపతి, తదితరులు పాల్గొన్నారు.

వ్యాధుల నివారణపై కళాజాత


కళాజాత ప్రదర్శన ఇస్తున్న కళాకారులు

కెరమెరి: మండలంలోని జోడేఘాట్, బాబేఝరి గ్రామాల్లో గురువారం వ్యాధుల నివారణపై కళాకారులు కళాజాత ప్రదర్శన ఇచ్చారు. మాతాశిశు సంరక్షణ, మలేరియా, డెంగీ, చికున్ గున్యా, ఫైలేరియా, సికిల్‌సెల్, తలసేమియా వ్యాధుల గురించి వివరించారు. వ్యక్తిగత పరిసరాల పరిశుభ్రత, కుటుంబ నియంత్రణ, కిశోర బాలికల పౌష్టికాహారం, బాల్యావివాహాలు తదితర అంశాలపై ఆటాపాటలతో అవగాహన కల్పించారు. హెల్త్ అసిస్టెంట్లు, ఏఎన్‌ఎంలు ఉన్నారు.

అండర్‌గ్రౌండ్ బ్రిడ్జి వద్ద మరమ్మతు

రెబ్బెన: మండలంలోని లేతన్‌గూడ అండర్ గ్రౌండ్ బ్రిడ్జి వద్ద మరమ్మతు చేపడుతున్నారు. మాజీ జెడ్పీటీసీ వేముర్ల సంతోష్ గురువారం మరమ్మతు పనులు పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బ్రిడ్జిలో రెండు, మూడు ఫీట్ల లోతులో నీరు నిల్వ చేరి ఉండటంతో గొల్లగూడ ప్రజలు అనేక ఇబ్బందులకు గురయ్యారని అన్నారు. గ్రామానికి వెళ్లే వాహనాలు సైతం నిల్వనీటి కారణంగా చెడిపోవడంతో గ్రామస్తుల కోరిక మేరకు సమస్యను రైల్వే అధికారుల దృష్టికి తీసుకెళ్లినట్లు తెలిపారు.

విజేతలకు బహుమతులు

కాగజ్‌నగర్‌రూరల్: మండలంలోని కోయవాగు చింతగూడ గ్రామంలో నిర్వహించిన క్రికెట్ టోర్నమెంట్ విజేతలకు మాజీ ఎమ్మెల్యే కోనేరు కోనప్ప గురువారం బహుమతులు ప్రదానం చేశారు. గురువారం జరిగిన ఫైనల్ మ్యాచ్ కోయవాగు చింతగూడ, సారసాల జట్ల మధ్య హోరాహోరీగా కొనసాగగా, సారసాల జట్టు విజేతగా నిలిచింది. విజేత జట్టుకు రూ.40 వేలు, రన్నర్‌గా నిలిచిన జట్టుకు రూ.20 వేలు అందజేశారు. నాయకులు సిద్దిక్, బాబా, నాగేందర్, కలీం, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి జంగుబాయి ఉత్సవాలు


ధనోరాలో జంగుబాయి ఆలయం


కొలువుదీరనున్న దేవత విగ్రహాలు

- తరలిరానున్న కొలాం ఆదివాసీలు
- ఏర్పాట్లు పూర్తి

కెరమెరి: మండలంలోని ధనోరా గ్రామంలో శుక్రవారం నుంచి జంగుబాయి ఉత్సవాలు ప్రారంభం కానుంది. శనివారం ముగియనుంది. అమ్మవారిని దర్శించుకునేందుకు ఉమ్మడిజిల్లాతోపాటు మహారాష్ట్రకు చెందిన కొలాం ఆదివాసీల భక్తులు తరలిరానున్నారు. మండలంలోని తెలంగాణ–మహారాష్ట్ర సరిహద్దులోని మహారాజ్‌గూడ అడవుల్లో వందేళ్ల చరిత్ర గల జంగుబాయి గుహకు వెళ్లి కొలాం ఆత్రం వంశస్తులు పూజలు నిర్వహించి దీపం వెలిగిస్తారు. తర్వాత పుష్యమాసం చివరివారంలో కెరమెరి మండలం ధనోరా గ్రామంలో ప్రతి ఏటా ఉత్సవాలు నిర్వహిస్తారు. ఈసారి ఘనంగా నిర్వహించేందుకు నిర్వాహకులు ఏర్పాట్లు పూర్తిచేశారు.

వందేళ్ల చరిత్ర

ధనోరా గ్రామంలో జంగుబాయి ఉత్సవాలకు వందేళ్ల చరిత్ర ఉంది. ముక్కిలొంక, పార్డా గ్రామానికి చెందిన ఆత్రం లచ్చు..జంగుబాయి భక్తుడు. ఆయనకు దేవత కలల్లో వచ్చింది. తనను భక్తిశ్రద్ధలతో పూజిస్తే ఆయురారోగ్యాలతోపాటు పంటల్లో దిగుబడులు, గ్రామంలో సుఖశాంతులు ఉంటాయని చెప్పింది. ఆ విధంగా లచ్చు వందేళ్ల క్రితం జంగుబాయి గుహలో దీపాన్ని వెలిగించారు. అప్పటి నుంచి ఉత్సవాలు ఏర్పాటు చేయడం ప్రారంభించాడు. ఏటా పుష్యమాసం చివరి వారంలో దీపారాధన అనంతరం ఉత్సవాలు నిర్వహించడం ఆనవాయితీగా వస్తోంది. గురువారం రాత్రి కొలాం ఆత్రం వంశస్తులు దీపాలు వెలిగించారు. శుక్రవారం ఉత్సవాలు ప్రారంభించి కొలాం ఆదివాసీలు అమ్మవారికి పూజలు చేస్తారు. ఆత్రం గోత్రం వారికి చెందిన జెండాను ఎగురవేస్తారు. సమాధులకు పూజలు చేస్తారు. ఉమ్మడి జిల్లా నుంచే కాక మహారాష్ట్రలోని జివితి, అంభేఝరి, సేడ్‌వాహి, తదితర గ్రామాల భక్తులు తరలిరానున్నారు.

కోర్కెలు నెరవేరుతాయి



జంగుబాయి దేవతను పూజిస్తే సకల కార్యాలు నెరవేరుతాయి. ప్రతి ఏటా ఆత్రం వంశస్తులు దేవతను ఇక్కడి గుడిలో పూజిస్తారు. భక్తిశ్రద్ధలతో అమ్మవారికి పూజలు చేస్తే కోర్కెలు నెరవేరుతాయని నమ్మకం.

– ఆత్రం భీము, కొలాం కొఠారి

అంగన్‌వాడీ కేంద్రాలను నిరంతరం పర్యవేక్షించాలి

- కలెక్టర్ వెంకటేశ్ దోత్రే


మాట్లాడుతున్న కలెక్టర్ వెంకటేశ్ దోత్రే

ఆసిఫాబాద్‌రూరల్: జిల్లాలోని అంగన్‌వాడీ కేంద్రాలను నిరంతరం పర్యవేక్షించాలని కలెక్టర్ వెంకటేశ్ దోత్రే అన్నారు. జిల్లా కేంద్రంలోని సఖి కార్యాలయంలో గురువారం సీడీపీవోలు, సూపర్‌వైజర్లకు ఒకరోజు శిక్షణ కార్యక్రమ నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ అంగన్‌వాడీ కేంద్రాల్లో బాలింతలు, గర్భిణులు, చిన్నారులకు సక్రమంగా పోషకాహారం అందించాలన్నారు. నిత్యం సందర్శిస్తూ సౌకర్యాలు కల్పించాలని ఆదేశించారు. కార్యక్రమంలో జిల్లా సంక్షేమశాఖ అధికారి భాస్కర్, తదితరులు పాల్గొన్నారు.

వేతనాలు చెల్లించాలని వినతి


వినతిపత్రం అందజేస్తున్న అర్చక సంఘం నాయకులు

సిర్పూర్(టి): రాష్ట్రవ్యాప్తంగా ఆలయాల్లో సేవలు అందిస్తున్న దూపదీప నైవేద్య అర్చకుల వేతనాలు విడుదల చేయాలని కోరుతూ సంఘం జిల్లా నాయకులు గురువారం హైదరాబాద్‌లోని దేవాదాయ ధర్మధాయ శాఖ కమిషనర్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు గంగు సత్యనారాయణ శర్మ మాట్లాడుతూ అర్చకులకు గత మూడునెలలుగా వేతనాలు రావడం లేదని అన్నారు. ప్రభుత్వం వెంటనే స్పందించి వేతనాలు విడుదల చేయాలని కోరారు. జిల్లా ప్రధాన కార్యదర్శి వారణాసి శ్రీనివాస్, అర్చకులు పాల్గొన్నారు.

‘అపార్’ నమోదు చేయాలి


హెచ్‌ఎంలతో మాట్లాడుతున్న ఎంఈవో

కెరమెరి: విద్యార్థులకు ఆపార్ నమోదు చేయాలని ఎంఈవో ఆడే ప్రకాశ్ అన్నారు. మండలంలో గురువారం ఆయా గిరిజన ఆశ్రమ ఉన్నత, ప్రాథమిక పాఠశాలల హెచ్‌ఎంలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలో 100 పాఠశాలలు, ఆశ్రమ పాఠశాలలు ఉన్నప్పటికి గిరిజన పాఠశాలలలో అపార్ నమోదు తక్కువగా ఉందన్నారు. వీటి నమోదులో ఏవైన ఇబ్బందులు ఉంటే ఎమ్మార్సీ సిబ్బందికి ఫోన్‌చేసి నివృత్తి చేసుకోవాలన్నారు.

పేదలకు వైద్యసేవలందించాలి


వైద్యాధికారితో మాట్లాడుతున్న అశోక్

కెరమెరి: పేదలకు సకాలంలో వైద్య సేవలు అందించాలని ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షుడు గోగర్ల అశోక్ అన్నారు. మండల కేంద్రంలోని వైద్యాధికారి కేశవ్‌ను గురువారం కలిశారు. మండలానికి ఒకటే ప్రాథమిక కేంద్రం ఉందని, దూర ప్రాంతాల నుంచి వచ్చే వారికి నాణ్యమైన వైద్యం అందించాలని కోరారు. నాయకుడు మహేశ్ తదితరులు ఉన్నారు.

విద్యార్థులు ఉన్నతస్థాయికి ఎదగాలి


మెటీరియల్ అందిస్తున్న నాయకులు

ఆసిఫాబాద్‌రూరల్: విద్యార్థులు బాగా చదివి ఉన్నతస్థాయికి ఎదగాలని ఎంఐఎం పార్టీ హైదరాబాద్ ఎమ్మెల్సీ మీర్జా రహమత్ అన్నారు. జిల్లా కేంద్రంలోని ఉర్దూ మీడియం పాఠశాలలో పదో తరగతి విద్యార్థులకు గురువారం మెటీరియల్ పంపిణీ చేశారు. ఆయన మాట్లాడుతూ విద్యార్థులు క్రమశిక్షణతో చదవాలన్నారు. పదో తరగతి వార్షిక పరీక్షల్లో మెరుగైన మార్కులు సాధించాలన్నారు. ఎంఐఎం పార్టీ ఆధ్వర్యంలో ఏటా మెటీరియల్ పంపిణీ చేస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో నాయకులు సల్మాన్‌ఖాన్, హెచ్‌ఎం నిజాం, నాయకులు కలాం, తాహెరా పాల్గొన్నారు.

నేడు విద్యుత్ అంతరాయం

ఆసిఫాబాద్: జిల్లా కేంద్రంలోని జంగంవాడలో శుక్రవారం విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగుతుందని ఏఈ లక్ష్మీరాజం ఓ ప్రకటనలో తెలిపారు. సమ్మర్‌యాక్షన్ ప్లాన్‌లో భాగంగా నూతన ట్రాన్స్‌ఫార్మర్, లైన్ మరమ్మతు దృష్ట్యా ఉదయం 10 నుంచి సాయంత్రం 5 గంటల వరకు సరఫరా నిలిపివేయనున్నట్లు పేర్కొన్నారు. ఈ విషయాన్ని వినియోగదారులు గమనించాలని కోరారు.

చెత్తాచెదారం తొలగింపు


ట్రాక్టర్‌తో చదును చేయిస్తున్న సురేశ్ కుమార్

ఆసిఫాబాద్: జిల్లా కేంద్రంలోని పెద్దవాగు వద్ద నవజ్యోతి సాంస్కృతిక సమాఖ్య ఆధ్వర్యంలో ట్రాక్టర్లతో గురువారం చదును చేయించారు. నాచు, రాళ్లు రప్పలు, తుంగ, చెత్త పాకురు తొలగించారు. పెద్దవాగు వద్ద స్నానాల ఘాట్ లేకపోవడంతో మహిళలు ఇబ్బందులకు గురవుతున్నారని, ఈక్రమంలో తన తండ్రి శ్రీనివాసరావు స్మారకార్థం స్నానఘట్టం నిర్మిస్తానని సంస్థ వ్యవస్థాపకుడు సురేశ్‌కుమార్ తెలిపారు.

ఖైదీలకు ఉచిత న్యాయ సహాయం

ఆసిఫాబాద్: ఆర్థిక స్థోమత లేని నిరుపేద ఖైదీలకు ఫ్రీలీగల్ ఎయిడ్ ద్వారా ఉచిత న్యాయ సహాయం అందిస్తామని డిస్ట్రిక్ట్ సెషన్స్ జడ్జి ఎంవీ రమేశ్ అన్నారు. ఈ నెల 23 నుంచి 25 వరకు నిర్వహించే లీగల్ అవేర్‌నెస్ క్యాంపులో భాగంగా గురువారం జిల్లా కేంద్రంలోని స్పెషల్‌సబ్ జైలులో ఖైదీలకు చట్టాలపై అవగాహన కల్పించారు. ఆర్థిక స్థోమత లేని అండర్ ట్రయల్ ఖైదీలకు జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో అందించే ఉచిత న్యాయ సహాయాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. అనంతరం ఖైదీల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో సీనియర్ సివిల్ జడ్జి కె.యువరాజ, జైలర్ ప్రేమ్‌కుమార్, బ్రహ్మకుమారి సారిక, న్యాయవాదులు నరహరి, వెంకటేశ్వర్లు, అంజనాదేవి, జయరాజ్ పాల్గొన్నారు.

‘శివకాంత్‌ను విధుల్లోకి తీసుకోవాలి’


మాట్లాడుతున్న సివిల్ కాంట్రాక్ట్ కార్మికులు

శ్రీరాంపూర్: ఎంతో కాలంగా పనిచేస్తున్న కాంట్రాక్ట్ కార్మికుడిని సింగరేణి శ్రీరాంపూర్ ఏరియా సివిల్ సూపర్‌వైజర్ వేధింపులకు గురి చేస్తున్నారని సివిల్ కాంట్రాక్ట్ కార్మికులు తెలిపారు. నస్పూర్–శ్రీరాంపూర్ ప్రెస్‌క్లబ్‌లో గురువారం మాట్లాడారు. శ్రీరాంపూర్ సివిల్ డిపార్టుమెంట్‌లో పనిచేస్తున్న శివకాంత్ కాంట్రాక్ట్ కార్మికుడు అనారోగ్య కారణాల వల్ల నెల రోజులు డ్యూటీలకు రాలేదన్నారు. ఆరోగ్యం బాగయ్యాక డ్యూటీకి వస్తే, సంబంధిత సూపర్‌వైజర్ గంగారాం డ్యూటీలకు తీసుకోకుండా వేధింపులకు గురి చేస్తున్నారని వాపోయారు. ఎందుకని అడిగితే సంబంధిత కాంట్రాక్టర్‌తో చెప్పించాలన్నారు. కాంట్రాక్టర్ తీసుకోమని చెప్పినా కూడా వినిపించుకోలేదన్నారు. చివరికి ఉన్నతాధికారులను కలిస్తే వారు కూడా సమ్మతించారన్నారు. ఐనా తీసుకోకుండా దురుద్దేశ్యంతో కార్మికున్ని తిప్పించుకుంటూ ఇబ్బందులకు గురి చేస్తున్నారని ఆరోపించారు. తను కూడా ఆఫీసుకు వచ్చి సూపర్‌వైజర్‌ను బ్రతిమిలాడినా వినిపించుకోవడం లేదని కాంట్రాక్ట్ కార్మికుడి తల్లి సమ్మక్క ఈ సందర్భంగా వాపోయింది. గురువారం కూడా శివకాంత్ శ్రీరాంపూర్‌లోని సివిల్ కార్యాలయానికి వచ్చి మరోసారి సూపర్‌వైజర్‌ను బ్రతిమిలాడినా వినిపించుకోలేదని, దీంతో తీవ్ర మనోవేదనతో సెల్‌ఫోన్ ఆఫీసులోనే పడేసి ఎవరికీ చెప్పకుండా ఉదయం అదృశ్యం అయ్యాడని పేర్కొన్నారు. దీనిపై ఉన్నతాధికారులు స్పందించి కాంట్రాక్ట్ కార్మికుడిని తక్షణమే డ్యూటీలకు తీసుకొని వేధింపులకు గురిచేసిన సూపర్‌వైజర్ గంగారాంపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కాంట్రాక్ట్ కార్మికులు పాల్గొన్నారు.

గోదావరిఖనిలో ఆచూకీ..

సివిల్ కార్యాలయం నుంచి అదృశ్యమైన శివకాంత్ సాయంత్రం వరకు ఎవరికీ అందుబాటులోకి రాలేదు. కుటుంబ సభ్యులు, కాంట్రాక్ట్ కార్మికులు శ్రీరాంపూర్ పోలీసులను కలిసి ఫిర్యాదు చేశారు. చివరికి పోలీసులు, తోటి కార్మికులు అతడి ఆచూకీ కోసం వెతుకగా గోదావరిఖనిలో దొరికాడు. దీంతో అందరూ ఊపిరిపీల్చుకున్నారు. ఈ విషయమై సూపర్‌వైజర్ గంగారాంను వివరణ కోసం ఫోన్ చేయగా ఆయన స్పందించలేదు.

క్రికెట్ టోర్నమెంట్ ప్రారంభం


ప్రారంభిస్తున్న నాయకులు

పెంచికల్‌పేట్: మండలంలోని అగర్‌గూడ గ్రామంలో కోనేరు యూత్ ఆధ్వర్యంలో గురువారం క్రికెట్ టోర్నమెంట్‌ను ప్రారంభించారు. మాజీ సర్పంచులు జాజిమొగ్గ శ్రీనివాస్, సంజీవ్, సుధాకర్, నాయకులు చౌదరి తిరుపతి, వెంకటాచలం, మారయ్య, రాకేశ్, గంగు, నరేశ్, భాస్కర్, శ్రీనివాస్, వెంకటి, రామయ్య తదితరులు పాల్గొన్నారు.

ఆకట్టుకున్న బొమ్మల కొలువు

మందమర్రిరూరల్: మందమర్రి ఏరియాలోని సింగరేణి ఎల్లందు క్లబ్ ఆవరణలో గురువారం లేడీస్ క్లబ్ ఆధ్వర్యంలో నిర్వహించిన బొమ్మల కొలువు ఆకట్టుకుంది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఏరియా జీఎం దేవేందర్ సతీమణి, లేడీస్‌క్లబ్ ఏరియా అధ్యక్షురాలు స్వరూపరాణి హాజరై ప్రారంభించారు. ఆటల పోటీలు నిర్వహించారు. గెలిచిన వారికి బహుమతులు ప్రదానం చేశారు.

ఘనంగా సుభాష్ చంద్రబోస్ జయంతి


కెరమెరి: నివాళులర్పిస్తున్న నాయకులు


రెబ్బెన: విగ్రహానికి పూలమాల వేస్తున్న మాజీ జెడ్పీటీసీ సంతోష్

రెబ్బెన: నేతాజీ సుభాష్ చంద్రబోస్ జయంతిని గురువారం ఘనంగా నిర్వహించారు. మండల కేంద్రంలోని గ్రామ పంచాయతీ కార్యాలయం వద్ద ఆయన విగ్రహానికి మాజీ జెడ్పీటీసీ వేముర్ల సంతోష్ పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అజాద్ హింద్ ఫౌజ్‌ను స్థాపించి బ్రిటీష్ తెల్లదొరలకు వ్యతిరేకంగా పోరాటం చేశారని పేర్కొన్నారు. పంచాయతీ కార్యదర్శి రవీందర్, కాంగ్రెస్ నాయకులు చిరంజీవిగౌడ్, అవిడపు గోపి, పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

కెరమెరి: మండలంలోని చౌపన్‌గూడలో నెహ్రూ యువ కేంద్ర ఆధ్వర్యంలో శ్రీ చైతన్య యూత్ అసోసియేషన్ నాయకులు సుభాష్ చంద్రబోస్ జయంతిని నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. సంఘ సభ్యులు కాత్లె జగన్, మడావి తుకారాం, మెస్రం హన్మంత్‌రావు, హన్ను, బొజ్జిరావు, యాదోశావ్, చిత్రు, ఆత్రం కుసుంబ్‌రావు, పాల్గొన్నారు.

వాంకిడి: మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో సుభాష్ చంద్రబోస్ జయంతిని నిర్వహించారు. అనంతరం పోషకుల సమావేశం నిర్వహించారు. పిల్లలను క్రమం తప్పకుండా కళాశాలకు పంపించాలని సూచించారు. ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ చంద్రయ్య, అధ్యాపకులు పాల్గొన్నారు.

కాగజ్‌నగర్‌రూరల్: పట్టణంలోని సీనియర్‌సిటిజన్స్ కార్యాలయంలో సుభాష్ చంద్రబోస్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. రాష్ట్ర నాయకుడు మార్త సత్యనారాయణ, నాయకులు కలికోట రమణయ్య, నాగేశ్వర్‌రావు, అహ్మద్, ఫారూక్, తదితరులు పాల్గొన్నారు.

అర్హులందరికీ సంక్షేమ పథకాలు


రెబ్బెన: రాంపూర్ గ్రామసభకు హాజరైన డీపీవో


సిర్పూర్(టి): మాట్లాడుతున్న ఎంపీడీవో

కౌటాల: అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందిస్తామని ఎంపీడీవో కోట ప్రసాద్ అన్నారు. మండలంలోని బోదంపల్లి, గురుడుపేట గ్రామాల్లో గురువారం గ్రామసభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జాబితాలో లేని వారు దరఖాస్తు చేసుకోవాలన్నారు. కాగా, వీర్దండిలో అధికారులు అర్హుల జాబితాను చదివి వినించారు. అర్హులను ఎంపిక చేయలేదని స్థానికులు అసంతృప్తి వ్యక్తం చేశారు. ఇందిరమ్మ ఇళ్ల జాబితాలో అనర్హుల పేర్లు ఉన్నాయన్నారు. అనంతరం అర్హుల నుంచి దరఖాస్తులు స్వీకరించారు. ప్రత్యేకాధికారి నానాజీ, కార్యదర్శులు సునీత, సురేష్, ఏఈఓ రేష్మిత, కవిత, స్థానికులు పాల్గొన్నారు.

రెబ్బెన: పథకాల కోసం అర్హుల ఎంపిక కోసం గ్రామసభలు పకడ్బందీగా చేపడుతున్నామని డీపీవో భిక్షపతి అన్నారు. మండలంలోని రాంపూర్, తక్కళ్లపల్లి, నవేగాం, కొండపల్లి, కైరిగూడ, రాజారాం పంచాయతీల్లో గురువారం గ్రామసభలు నిర్వహించారు. రాంపూర్‌లో డీపీవో హాజరై మాట్లాడుతూ జాబితాలో పేర్లు రానివారు ప్రజలు ఆందోళన చెందాల్సిన అవసరం లేదన్నారు. అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందేలా చూస్తామన్నారు. గ్రామసభల ద్వారా కొత్తగా దరఖాస్తులను స్వీకరిస్తామని అన్నారు. ఎంపీడీవో శంకరమ్మ, ఏవో దిలీప్‌కుమార్, జూనియర్ అసిస్టెంట్ షేక్ షబీర్ మియా, పంచాయతీ కార్యదర్శి ధనలక్ష్మి పాల్గొన్నారు.

దహెగాం: మండలంలో గ్రామసభలు కొనసాగుతున్నాయి. ఐనం, కోత్మీర్, పీపీరావు కాలనీ, హత్తిని, గిరవెల్లి, కమ్మర్‌పల్లిలో గురువారం గ్రామసభలు నిర్వహించారు. జాబితాలో పేర్లు లేని వారు మరోసారి దరఖాస్తులు చేసుకోవాలని అధికారులు సూచించారు. ప్రత్యేకాధికారులు రాజేందర్, ఇనోస్, రమేశ్, ఆత్మారాం, కార్యదర్శులు, ఏఈవోలు ప్రజలు పాల్గొన్నారు.

పెంచికల్‌పేట్: ఎల్కపల్లి, పెంచికల్‌పేట్, ఎల్లూర్ గ్రామాల్లో తహసీల్దార్ వెంకటేశ్వర్‌రావు, ఎంపీడీవో అల్బర్ట్ ఆధ్వర్యంలో గురువారం గ్రామసభలు నిర్వహించారు. మండల ప్రత్యేక అధికారి ప్రభాకర్ రావు, ఏఈ ఖదీర్, ఏవో మనీషా, ఏఈవో శ్రీవిద్య, కార్యదర్శులు చంద్రశేఖర్, అర్చన, చంద్రయ్య, గ్రామస్తులు పాల్గొన్నారు.

సిర్పూర్(టి): అర్హులందరూ దరఖాస్తులను చేసుకోవాలని ఎంపీడీవో సత్యనారాయణ అన్నారు. మండలంలోని అచ్చెల్లి గ్రామసభలో ఆయన పాల్గొని మాట్లాడారు. గతంలో దరఖాస్తులు చేసుకున్న వారి వివరాలు మాత్రమే అందుబాటులో ఉన్నాయన్నారు. జాబితాలో పేర్లు లేకపోతే దరఖాస్తులు అందించాలన్నారు.

ట్రాఫిక్ నియమాలు పాటించాలి


మాట్లాడుతున్న సీఐ సత్యనారాయణ

శ్రీరాంపూర్: ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ నియమాలు పాటించి వాహనాలు నడుపాలని మంచిర్యాల ట్రాఫిక్ సీఐ సత్యనారాయణ తెలిపారు. శ్రీరాంపూర్‌లోని ఆర్కే 6 గనిలో గురువారం రోడ్డు భద్రతపై అవగాహన కల్పించారు. బైక్‌లపై డ్యూటీకు వెళ్లేటప్పుడు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలన్నారు. ఫోర్ వీలర్‌లో వెళ్తే సీట్ బెల్టు పెట్టుకోవాలన్నారు. మితిమీరిన వేగం, మద్యం సేవించి వాహనాలు నడపడం చేస్తే కఠిన చర్యలు ఉంటాయన్నారు. గనిలో ఏ విధంగా రక్షణగా పని చేస్తారో, రోడ్డుపై ప్రయాణించేటప్పుడు కూడా అంతే జాగ్రత్తలు పాటించాలన్నారు. కార్యక్రమంలో గని మేనేజర్ తిరుపతి, రక్షణ అధికారి కాదాసి శ్రీనివాస్, అడిషనల్ మేనేజర్ మఱ్ఱి కొమురయ్య, సర్వే అధికారి ఎస్పీ వర్మ, సీనియర్ పర్సనల్ ఆఫీసర్ సురేందర్, గుర్తింపు సంఘం ఏఐటీయూసీ డిప్యూటీ ప్రధాన కార్యదర్శి ముష్కె సమ్మయ్య, ఫిట్ సెక్రెటరీ సంఘం సదానందం, నాయకులు ఉన్నారు.

గైర్హాజరు కార్మికులకు కౌన్సెలింగ్

కాసిపేట: మందమర్రి ఏరియా కాసిపేట 1గనిపై గురువారం గైర్హాజరు కార్మికులకు అధికారులు, కార్మిక సంఘాల నాయకుల ఆధ్వర్యంలో కౌన్సెలింగ్ నిర్వహించారు. గని మేనేజర్ భూశంకరయ్య మాట్లాడుతూ.. నెలకు అండర్‌గ్రౌండ్ కార్మికులు 16మస్టర్లు, సర్ఫేస్ కార్మికులు 20మస్టర్లకు తక్కువ చేసిన వారికి ఉదయం మేనేజర్ కార్యాలయంలో, మధ్యాహ్నం క్యాంటిన్ హాల్లో కౌన్సెలింగ్ నిర్వహించినట్లు తెలిపారు. మొత్తం 65మంది కార్మికులకు కౌన్సెలింగ్ ఇచ్చి కుటుంబ అభివృద్ధి, ఉత్పత్తి దృష్ట్యా ముమ్మందు గైర్హాజరు కాకుండా డ్యూటీలకు హాజరు కావాలన్నారు. కార్యక్రమంలో రక్షణాధికారి నిఖిల్ అయ్యార్, ఏఐటీయూసీ బ్రాంచి కార్యదర్శి దాగం మల్లేష్ పాల్గొన్నారు.

ఐఎన్టీయూసీ ఏరియా కార్యదర్శిగా వీరమల్లు

శ్రీరాంపూర్: ఐఎన్టీయూసీ శ్రీరాంపూర్ ఏరియా కార్యదర్శిగా దండే వీరమల్లును ఎన్నుకున్నారు. ఈ మేరకు గురువారం ఎస్ఆర్పీ 3 గనిలో జరిగిన ఫిట్ కమిటీ సమావేశంలో యూనియన్ బ్రాంచ్ ఉపాధ్యక్షుడు జెట్టి శంకర్‌రావు ఆధ్వర్యంలో వీరమల్లును ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. గని ఫిట్ కార్యదర్శిగా రిక్కుల గోపాల్ రెడ్డి, సహాయ కార్యదర్శిగా చల్లంగి శ్రీనివాసరావులను ఎన్నుకున్నారు. ఎన్నికైన కమిటీ నాయకులను గ్రూప్ ఏజెంట్, మేనేజర్‌లకు పరిచయం చేయించి కమిటీ పేర్లు సమర్పించారు. కార్యక్రమంలో ఆ యూనియన్ కేంద్ర ఉపాధ్యక్షుడు కలవేన శ్యామ్, మైనింగ్ స్టాఫ్ కేంద్ర ఇన్‌చార్జీ తిరుపతి రాజు, కార్యదర్శి బాపు పాల్గొన్నారు.